సాక్షి
ఖమ్మం
శుక్రవారం : 19 : ఏప్రిల్ : 2024





## టచ్ చేసే సత్తా ఎవరికీ లేదు..
కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టచ్ చేసే సత్తా ఏ పార్టీకీ, వ్యక్తులకు లేదని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. 8లో



## కాలిబూడిదైన ఆస్తులు
జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన అగ్నిప్రమాదాల్లో గడ్డివాములు, ఇల్లు, తోటలు కాలిబూడిదయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
44° / 28°

## వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రరూపం దాలుస్తుంది.

# రాజాధిరాజుగా రామయ్య



దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రంలో శ్రీరాముడి పట్టాభిషేకం గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రాలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ వేడుకకు రాష్ట్ర ప్రథమ పౌరుడు, గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీరాముడికి పట్టువస్త్రాలు సమర్పించారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

### భద్రాద్రి రాముడికి శాస్త్రోక్తంగా పట్టాభిషేకం
- రాజదండం, రాజముద్రిక, స్వర్ణ ఖడ్గాలకు పూజలు
- మంత్రించిన జలప్రోక్షణతో పట్టాభిషిక్తుడైన స్వామివారు
- చివరన శ్రీ ఆంజనేయ స్వామికి పట్టాభిషేకం
- వేడుకకు హాజరైన గవర్నర్ రాధాకృష్ణన్



పట్టాభిషేక క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు (ఇన్‌సెట్) కిరీటాన్ని చూపిస్తున్న అర్చక స్వామి



స్వామి వారికి వస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

**ఆలయం నుంచి అయోధ్యాపురికి..**

పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని సీతాసమేతుడైన శ్రీరాముడు లక్ష్మణుడిని తోడుగా తీసుకుని ప్రధాన ఆలయం నుంచి అయోధ్యపురి (మిథిలా స్టేడియం)కి పల్లకీలో భక్తుల కోలాహలం నడుమ బయలుదేరి, మాడ వీధులు గుండా ఉదయం 10:30 గంటలకు వేదికపైకి చేరుకున్నారు. అక్కడ అర్చకులు ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత శ్రీరాముడికి పట్టాభిషేకం చేసేందుకు వీలుగా వేద పండితులు రుత్విక్కులైన వశిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సూయజ్ఞుడిని ఆవాహన చేసుకున్నారు. వీరందరికీ నేతృత్వం వహించే వాల్మీకిని మరొకరికి ఆవాహన చేశారు.

**మండపత్రయ ఆరాధన..**

రుత్విక్కరణం తర్వాత పండితులు మండపత్రయ పూజలు ప్రారంభించారు. శ్రీరాముడి పట్టాభిషేకానికి సమస్త దేవతలు, సమస్త నదీ, సముద్ర జలాలతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేయడం ఈ మండపత్రయ ఆరాధన ప్రధాన ఉద్దేశం. పట్టాభిషేకం వేదిక దిగువ భాగంలో మూడు కలశాలను ఏర్పాటు చేశారు. మధ్య కలశంలో సముద్ర జలాలు, నదీ జలాలను ఆవాహన చేశారు. ప్రధానంగా తూర్పున పూరీ, దక్షిణాన ధనుష్కోటి, పశ్చిమాన ద్వారకలకు చెందిన సముద్ర జలాలు అవాహన చేయగా ఆగ్నేయం నుంచి గంగా, నైరుతి నుంచి కృష్ణా, వాయువ్యం నుంచి గోదావరి, ఈశాన్యం నుంచి కావేరీ నదీ జలాలను ఆవాహన చేశారు. నదీ, సముద్ర జలాలను ఆవాహన చేసిన కలశానికి కుడివైపున ఉన్న కలశంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేశారు. తూర్పున హనుమ, పడమరన లక్ష్మణ, ఉత్తరాన శత్రఘ్నుడు, దక్షిణాన భరతుడు, ఆగ్నేయంలో అంగధుడు, వాయువ్యంలో సుగ్రీవుడు, ఈశాన్యంలో విభీషణుడు, నైరుతిలో జాంబవతుడిని ఆవాహన చేశారు. ఎడమ వైపు కలశంలో అష్టదిక్పాలకులను ఆవాహన చేశారు. ఇదే సమయంలో పట్టాభిషేకంలో రాజముద్రికలో లక్ష్మీదేవిని, రాజదండంలో విశ్వక్సేనుడిని, చామరలో వైనతేయుడు, గరుత్మంతుడు, ఖడ్గంలో నందకుడు, స్వర్ణఛత్రంలో అనంతుడు, పాదుకల్లో ఆదిశేషుడు, దేవేరులు ధరించే ఆభరణాల్లోకి భూదేవిని ఆవాహన చేశారు. మండపత్రయ ఆరాధాన ముగిసిన తర్వాత శ్రీరాముడికి అష్టోత్తర శతనామార్చన చేశారు. అనంతరం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆనాటి శ్రీరాముడి పాలన విశిష్టతను వివరించారు.

**శ్రీరాముడికి అలంకరణలు..**

పట్టాభిషేకత్సోవంలో శ్రీరాముడి అలంకణ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు మొదలైంది. ముందుగా రాజదండాన్ని స్వామివారి కుడిచేతిలో ఉంచారు. ఆ తర్వాత రాజముద్రిక తొడిగారు. అనంతరం రామదాసు చేయించిన పచ్చల పతకాన్ని శ్రీరాముడికి, చింతాకు పతకాన్ని సీతాదేవికి, రామమాడను లక్ష్మణుడికి అలంకరించారు. స్వామివారికి ఇరువైపులా చామరాలు ఉంచి, స్వర్ణఛత్రాన్ని, ఎడమ చేతిలో రాజఖడ్గాన్ని ధరింపజేశారు.

**పట్టాభిషేకం..**

స్వర్ణ ఛత్రం నీడలో రాజముద్రిక, రాజదండం, రాజఖడ్గం ధరించిన తర్వాత శ్రీరాముడికి పట్టాభిషేకం కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12:17 గంటలకు ప్రారంభించారు. మండపత్రయంలోని మూడు కలశాల్లోని సమస్త దేవతలు, సమస్త జలాలు, రామపరివారంతో కూడిన మంత్రించిన జలాన్ని శ్రీరాముడిపై ప్రోక్షణ చేస్తూ పట్టాభిషేకం కార్యక్రమాన్ని జరిపించారు. 12:25 గంటలకు మంగళ హారతి సమర్పించారు.

**హనుమాన్ పట్టాభిషేకం..**

పట్టాభిషేకం పూర్తయిన తర్వాత శ్రీరాముడికి ముత్యాల దండను ధరింప చేశారు. ఈ ముత్యాల దండను శ్రీరాముడు, సీతాదేవి మెడలో ధరింపచేశారు. చివరకు అదే దండను ఆంజనేయుడి మెడలో సీతమ్మ ధరింపజేస్తున్నట్టుగా.. ఆంజనేయుడి మెడలో వేసి పట్టాభిషేకం చేశారు. దీంతో శ్రీరామ పట్టాభిషేక వేడుక ముగియగా.. స్వామివారిని పల్లకీలో ఆలయానికి తీసుకెళ్లారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్..**

శ్రీరాముడి పట్టాభిషేకానికి గవర్నర్ రాధాకృష్ణన్ హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఆయన ప్రధాన ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, కంచి కామకోటి, త్రిదండి జీయర్ మఠం, అహోబిల మఠం తరఫున, ఐటీడీఏ పీఓ, తూము నరసింహదాసు వంశీయులు కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు.

### సిరియ తిరువడి పట్టాభిషేకం
వాల్మీకి రామయాణంలో పట్టాభిషేకానికి ముందు రోజు శ్రీరాముడు అయోధ్యను వదిలి వనవాసానికి వెళ్లారు. దీంతో ముందుగా రాముడి పాదుకలకు పట్టాభిషేకం జరిగింది, ఆ తర్వాత క్రమంలో సుగ్రీవుడికి, విభీషనుడికి, ఆ తర్వాతే శ్రీరాముడికి పట్టాభిషేకాలు జరిగాయి. విష్ణువుకు అన్ని అవతారాల్లో గరుత్మంతుడు సేవలు అందించడంతో ఆయనను పెరియ తిరువడిగా, ఒక్క రామావతారంలోనే సేవలందించిన ఆంజనేయుడిని సిరియ తిరువడిగా కొలుస్తారు. శ్రీరాముడి పాదుకలతో మొదలైన పట్టాభిషేక మహోత్సవం హనుమంతుడి పట్టాభిషేకంతో పూర్తయింది.

కేసీఆర్ నుంచి 'బీ' ఫామ్ అందుకుంటున్న ఎంపీ నామ, పక్కన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు



# పోరు షురూ..
- లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన మిగతా అభ్యర్థులు
- నేడు బీజేపీ ర్యాలీకి హాజరుకానున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- బీ ఫామ్ అందుకున్న 'నామా'

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికల పోరు మొదలైంది. లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు కాగా.. మిగతా అభ్యర్థులు సైతం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రధాన పార్టీలు భారీ ర్యాలీగా తమ అభ్యర్థులతో నామినేషన్ దాఖలు చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశాయి. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల నామినేషన్ తేదీలు ఖరారు కాగా, కాంగ్రెస్ అభ్యర్థిని ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించాల్సి ఉంది.

**ప్రక్రియ సజావుగా సాగేలా..**

అభ్యర్థుల నామినేషన్లను కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ స్వీకరిస్తున్నారు. ఈనెల 25 వరకు నామినేషన్లను స్వీకరించనుండగా, ప్రక్రియ సజావుగా సాగేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఆర్ఓ, ఏఆర్ఓ కార్యాలయాల్లో నామినేషన్ పత్రాలను అందుబాటులో ఉంచగా, అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. అలాగే, పోలీసులు సైతం చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు.

**నేడు తాండ్ర.. 24న నామ**

తొలిరోజు ఆధార్ పార్టీ అభ్యర్థి కుక్కల నాగయ్య నామినేషన్ దాఖలు చేయగా.. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఆతర్వాత ఖమ్మంలో నిర్వహించే భారీ ర్యాలీకి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2.40 గంటలకు రాజ్‌నాథ్‌సింగ్ ఖమ్మంలోని పటేల్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడి నుంచి టూ టౌన్ పోలీస్‌స్టేషన్, జెడ్పీ సెంటర్, మయూరిసెంటర్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్ వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొననున్న ఆయన ప్రసంగం అనంతరం హెలీకాప్టర్‌లో విజయవాడ వెళ్తారు. ఇక ఈనెల 24న నామినేషన్ దాఖలు చేసేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి గురువారం ఆయన హైదరాబాద్‌లో బీ ఫామ్ అందుకున్నారు.

**కాంగ్రెస్.. అదే ఉత్కంఠ**

ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటికే ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నియమించారు. అలాగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు అభ్యర్థి తరఫున ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**మొదలైన సందడి...**

పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలతో పార్టీల్లో సందడి మొదలైంది. ఇప్పటి వరకు అడపాదడపా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు ఇక నుంచి ముమ్మరం చేయాలని నిర్ణయించారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో ఓ విడత ప్రచారాన్ని పూర్తిచేశారు. ఇన్నాళ్లు కార్యకర్తలతో భేటీలకే ఎక్కువ సమయం వెచ్చించగా.. మిగిలిన 22రోజుల్లో ప్రచారానికి షెడ్యూల్ రూపొందించుకుంటున్నారు. అలాగే, అభ్యర్థుల తరఫున ప్రజాదరణ కలిగిన నేతలను ప్రచార రంగంలోకి దింపేందుకు కసరత్తు మొదలైంది. బీజేపీ నుంచి కేంద్ర మంత్రులు ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ తరఫున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు ప్రచార భారాన్ని మోయనున్నారు. కాంగ్రెస్ తరఫున డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రులు ప్రచార భారాన్ని తమ భుజాలపై వేసుకోనున్నట్లు తెలిసింది. అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు కూడా ప్రచారంలో పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

### న్యూస్‌రీల్

### శ్రీవారికి చక్రస్నానం, మహాపూర్ణాహుతి



శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా యాగశాలలో ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యాన మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో శ్రీవారికి చక్రస్నానం జరిపించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, తిరువీధి సేవలు నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, రామకృష్ణశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, శ్రామిక్స్ ఆరోగ్య స్థితిని తెలుసుకునేందుకు ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గ్రాండ్ హెల్త్ చాలెంజ్–2ను గురువారం ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న ప్రారంభించారు. గతేడాది గ్రాండ్ హెల్త్ చాలెంజ్–1ను నిర్వహించగా.. ఇప్పుడు రెండో విడతగా రక్త పరీక్షలు, ఈసీజీ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ల్యాబ్ టెక్నీషియన్లు ఉద్యోగుల రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధి ఉద్యోగులకు ఆరు రోజుల్లో పరీక్షలు నిర్వహిస్తామని ఆర్‌ఎం తెలిపారు. ఈకార్యక్రమంలో ఖమ్మం డీఎం శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య పాల్గొన్నారు.

# పారదర్శకంగా వ్యయపరిశీలన
జిల్లాకు చేరిన ఇద్దరు వ్యయ పరిశీలకులు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల వ్యయ పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రా సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం వీరిని ఖమ్మం పార్లమెంట్ స్థానానికి పరిశీలకులుగా నియమించగా గురువారం ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ స్వాగతం పలకగా, కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం, మీడియా సర్టిఫికేషన్ – మీడియా మానిటరింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ చేసిన ఏర్పాట్లు, నియమించిన బృందాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. కాగా, గురువారం నాటికి సీ–విజిల్ యాప్ ద్వారా 38 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 64 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

**పకడ్బందీగా ఈవీఎంల రవాణా**

లోక్‌సభ ఎన్నికలకు గాను ఈవీఎంల రవాణా విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. కలెక్టరేట్ ఆవరణలోని గోదాం నుంచి నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను తరలించేందుకు వాహనాల ఏర్పాట్లు, రవాణాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మినాల్ శ్రేష్ఠ, డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్, సీపీఓ శ్రీనివాస్, డీఆర్వో రాజేశ్వరి, ఆర్‌టీఓ అఫ్రిన్ సిద్దిఖీ, ట్రెజరీ డీడీ సత్యనారాయణ, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, ఉద్యోగులు అరుణ, వరప్రసాద్, వెంకటరమణ, మదన్‌గోపాల్, రాంబాబు పాల్గొన్నారు.



కంట్రోల్ రూమ్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, వ్యయ పరిశీలకులు

### 21న టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశపరీక్ష
ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ గురుకుల(రెసిడెన్షియల్) జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 21న పరీక్ష(టీఎస్‌ఆర్‌జేసీ సెట్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ రమ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం)లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరాల్సిన విద్యార్థులకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం టీఎస్ ఆర్‌జేడీసీ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు. లేదా 040–24734899, 94909 67222, 80081 18813 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

### త్వరలోనే బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ
ఖమ్మంమయూరీసెంటర్: ఖమ్మం లోక్‌సభ పరిధి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్ సమన్వయకర్తల ప్రకటన సమాచార లోపంతో బయటకు వచ్చిందని జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ తెలిపారు. త్వరలోనే పార్టీ ముఖ్యులతో చర్చించి సామాజిక అంశాల ఆధారంగా సమన్వయ కమిటీని ప్రకటిస్తామని వెల్లడించారు.

### నామకు 'బీ' ఫామ్ అందజేసిన కేసీఆర్
సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు గురువారం హైదరాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'బీ' ఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ అభ్యర్థులు ఘన విజయానికి గాను సభలు, సమావేశాలు, రోడ్డు షోలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఎలా ముందుకు సాగాలో కేసీఆర్ దిశానిర్దేశం చేశారని నామ తెలిపారు. అనంతరం ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధులు.. జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి, రాజుగౌడ్, శీలంశెట్టి వీరభద్రం తదితరులతో సమావేశమై అభ్యర్థి ప్రచార ప్రణాళికలపై చర్చించడంతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కూడా భేటీ అయ్యారు.

### తొలిరోజు ఒకే నామినేషన్
ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం విడుదల చేశారు. ఈమేరకు తొలిరోజు ఒకే నామినేషన్ దాఖలైంది. ముదిగొండ మండలం గంధసిరికి చెందిన కుక్కల నాగయ్య అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఆధార్) పార్టీ తరఫున నామినేషన్ సమర్పించారు. కాగా, నామినేషన్ల ప్రక్రియ మొదలుకావడంతో కలెక్టరేట్ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం నుంచే కలెక్టరేట్‌కు వచ్చివెళ్లే వారి వివరాలు ఆరా తీశాకే అనుమతించారు. అలాగే, హెల్ప్‌డెస్క్, రిటర్నింగ్ అధికారి చాంబర్ వద్ద సైతం పోలీసులు గస్తీ కాశారు.



నామినేషన్ అందజేస్తున్న నాగయ్య

# నోళ్లు తెరుస్తున్న చెరువులు
- ఎండవేడితో నెర్రెలు బారుతున్న వైనం
- నీరు లేక లక్షల్లో చేపల మృత్యువాత
- కాపాడుకునేందుకు మత్స్యకారుల భగీరథ యత్నాలు



చనిపోయిన చేపలతో మత్స్యకారులు



నీరు లేక నెర్రెలు బారిన చింతగుర్తిలో కొత్తచెరువు (ఇన్‌సెట్) రైతు బోర్ నుండి చెరువులోకి మళ్లిస్తున్న నీరు

రఘునాథపాలెం: వర్షాభావానికి తోడు ఎండల తీవ్రతతో జిల్లాలోని పలు చెరువుల్లో నీరు అడుగంటి నెర్రెలు బాస్తున్నాయి. సాగునీటి కొరతతో ఇప్పటికే రైతులు పంటలపై ఆశలు వదిలేసుకున్నారు. అయితే, చెరువుల్లో ఉన్న కొద్దోగొప్ప నీటితో చేపలు బతుకుతాయని ఆశిస్తున్న మత్స్యకారులకు సైతం ప్రస్తుతం నిరాశే ఎదురవుతోంది. చెరువులు వట్టిపోయి లక్షల్లో చేపలు మృత్యువాత పడుతుండడం వారికి అశనిపాతంలా మారుతోంది.

**చింతగుర్తిలో మత్స్యఘోష**

రఘునాథపాలెం మండలం చింతగుర్తి కొత్తచెరువులో 57మంది సభ్యులుగా ఉన్న మత్స్య సొసైటీ ద్వారా రూ.3లక్షలు వెచ్చించి 1.50లక్షల చేప పిల్లలు పోశారు. అలాగే, ప్రభుత్వం కూడా వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలు వదిలింది. అయితే, ఎండల కారణంగా చెరువులో నీరు పూర్తిగా అడుగంటగా చేపలు చనిపోయి తేలుతున్నాయి. ఈమేరకు ఎలాగైనా చేపలను రక్షించుకోవాలని ఆశతో రూ.లక్షన్నరపైగా వెచ్చించి చెరువు అంచునే బావి తవ్వించారు. అయితే, ఆ బావి కూడా ఎండిపోవడంతో సమీపంలోని రైతు వ్యవసాయ మోటార్‌ను అద్దెకు తీసుకుని చెరువులోకి బోరు నీటిని మళ్లిస్తున్నారు. కానీ బోరు నీరు చెరువు నెర్రెల్లోనే జారిపోతుండటంతో చేపల మృత్యుఘోష కొనసాగుతోంది. ఇప్పటికే రూ.లక్షల్లో అప్పులు చేసిన తాము మరింత నష్టపోకుండా ప్రభుత్వం చెరువు సమీపాన బోర్లు వేయించి నీరు మళ్లించాలని సొసైటీ సభ్యులు కోరుతున్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా 1,400పైగా ఉన్న చెరువుల్లో వెయ్యి చెరువుల్లో చేపపిల్లలు పోశారు. ఈసారి వర్షాభావ పరిస్థితులకు తోడు సాగర్ కాల్వల పరిధిలోని చెరువుల్లోకి నీరు చేరక అటు రైతులు, ఇటు మత్స్యకారులకు తీరని ఆవేదన మిగులుతోంది.

# మోడీ గ్యారంటీలపై ప్రజల్లో విశ్వాసం
- బీజేపీ ఖమ్మం అభ్యర్థి వినోద్‌రావు
- నేడు ర్యాలీకి హాజరుకానున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మరోమారు నరేంద్రమోడీ ప్రధానమంత్రి కావడం ఖాయమని.. మోడీ గ్యారంటీలపై పల్లె, పట్టణ ప్రజల్లో ఉన్న విశ్వాసమే తమ గెలుపునకు నాంది అని బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు వెల్లడించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ పరిధిలోని పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేయగా, ప్రజలు మోడీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తేలిందని చెప్పారు. మోడీ ప్రధాని అయ్యాకే దేశ ప్రతిష్ఠ పెరిగిందని, అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిందని తెలిపారు. దేశం రామరాజ్యంలా ఉండాలన్నా, అభివృద్ధిలో ముందుకు సాగాలన్నా మోడీ నాయకత్వం అవసరం కావడంతో ఖమ్మంలో కూడా ప్రజలు బీజేపీకి పట్టం కడతారన్న నమ్మకం ఉందని చెప్పారు. కాగా, తాను శుక్రవారం నామినేషన్ వేయనుండగా.. ఖమ్మం లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పటేల్ స్టేడియం నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్, జెడ్పీ సెంటర్, మయూరి సెంటర్, పెవిలియన్ గ్రౌండ్ వరకు ర్యాలీ సాగుతుందని.. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ర్యాలీలో పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. అంతేకాక ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, పార్టీ నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి హాజరవుతున్నందున ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటేస్తే వృథా అవుతుందని, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. జిల్లా ప్రజలు బీజేపీకి ఓటు వేయకున్నా.. కేంద్రం మాత్రం నిధుల వరద పారించిందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, వీరెల్లి లక్ష్మయ్య, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, శ్యాంరాథోడ్, చావా కిరణ్, బోళ్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి పాదుకలు చూపుతున్న అర్చకులు

రాజదండం




• రాజముద్ర


• ఛత్రం


• ముత్యాల హారం


• ఖడ్గం

# నయనానందకరం!

■ భద్రగిరిలో వేడుకగా శ్రీరామ పట్టాభిషేకం ■ దర్శించి పులకించిన భక్తజనం

భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో శ్రీసీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చక స్వాములు పట్టాభిషేకం ప్రత్యేకతలను వివరిస్తూ స్వామి వారి ఆయుధాలు, ఇతర ఆభరణాలను ప్రదర్శించారు. గవర్నర్ రాధాకృష్ణన్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించగా.. తెలంగాణ, ఏపీకి చెందిన వేలాది మంది భక్తులు పట్టాభిషేక మహోత్సవాన్ని కనులారా తిలకించి పులకించిపోయారు. భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఆలయ ఈఓ రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్





కంటి కామకోటి పీఠం తరఫున పట్టువస్త్రాలు అందచేస్తున్న శ్రీపాద శ్రీకర్, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఆలయ ఈఓ రమాదేవి



స్వామి పల్లకీ సేవలో దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఈఓ రమాదేవి







గవర్నర్ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్ (కుడివైపు నుంచి)

# కాంగ్రెస్‌ను టచ్ చేసే సత్తా ఎవరికీ లేదు..

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**కామేపల్లి:** ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీని టచ్ చేసే సత్తా ఏ పార్టీకి కానీ వ్యకులకు కానీ లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కామేపల్లి మండలం పాత లింగాలలో గురువారం రాత్రి జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనుండగా.. అనంతరం జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈమేరకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావడం ద్వారా ప్రతిపక్ష పార్టీల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాలని పిలుపునిచ్చారు. మూడు నెలలు, ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని మాజీ సీఎం కేసీఆర్ అంటున్నారని.. వారు కలలు తప్పు కాకున్నా సాకారమయ్యేలా కలలు కనాలని సూచించారు. ఐదేళ్ల తర్వాత అధికారంలోకి రావాలను కోవాలే తప్ప ఇప్పుడు ప్రజాప్రభుత్వాన్ని కూలుస్తామని చెబుతున్న నేతల మాటలను ప్రజలు గమనించాలని కోరారు. కాగా, కాంగ్రెస్ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన రాంరెడ్డి వెంకటరెడ్డి మృతితో పార్టీ పెద్ద దిక్కును కోల్పోయిందని, ఆయన కుటుంబానికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడగా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జగన్నాథరెడ్డి, దమ్మలపాటి వెంకటేశ్వరరావు, సాధు రమేష్‌రెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, ఏపూరి మహేందర్, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మలపాటి సత్యనారాయణ, ఆరెం రవి, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు ఆర్డీఓగా రాజేందర్

పూర్వ ఆర్డీఓ శ్రీనివాస్ సస్పెన్షన్ ?



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న రాజేందర్

**ఖమ్మం సహకారనగర్/కల్లూరు:** జిల్లాలోని కల్లూరు ఆర్డీఓగా ఎల్.రాజేందర్ గౌడ్ నియమితులయ్యారు. నారాయణపేటలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ)గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. ఈసందర్భంగా గురువారం ఖమ్మంలో కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం రాజేందర్ కల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

**పూర్వ ఆర్డీఓపై వేటు?**

కల్లూరు ఆర్డీఓగా పనిచేసిన కె.శ్రీనివాస్‌ను కలెక్టర్ గౌతమ్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. హనుమకొండ జిల్లా నుంచి కల్లూరుకు ఆయన పదిహేను రోజుల క్రితం బదిలీపై వచ్చారు. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా కూడా బాధ్యతలు నిర్వర్తించాల్సిన ఆయన ఐదు రోజుల పాటు పనిచేశాక సెలవులో వెళ్లారు. కానీ ఆయన సెలవును ఉన్నతాధికారులు ఆమోదించలేదని తెలిసింది. దీంతో ఎన్నికల కమిషన్ సూచనలతో సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఆయన స్థానంలో ప్రస్తుతం రాజేందర్‌ను నియమించారు.

# పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

**ఖమ్మంక్రైం:** ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలో మోహరించిన కేంద్ర పోలీసు బలగాలతో పాటు స్థానిక పోలీసులు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సరిహద్దులో 15 ఎఫ్‌ఎస్‌టీ, 15 ఎస్‌ఎస్‌టీ, రెండు అంతర్రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, పది అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఎనిమిది అంతర్ జిల్లా చెక్‌పోస్టుల ద్వారా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా తీసుకొచ్చే నగదు, ఆభరణాలు, ఇతరత్రా సొత్తును సీజ్ చేస్తామని.. నిబంధనల మేరకు రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని ఆయన ప్రజలకు సూచించారు. ఈవిషయంలో పోలీసులకు సహకరించాలని సీపీ తెలిపారు. అలాగే, నిర్ణీత సమయానికి షాపులు తెరిచి ఉంచినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# 28నుంచి రాష్ట్రస్థాయి టీ.టీ. టోర్నీ



టోర్నీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

**ఖమ్మం స్పోర్ట్స్:** ఖమ్మంలో ఈనెల28నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఓపెన్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, ఓలేటి సాంబమూర్తి వెల్లడించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం వారు టోర్నీ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రాయల నారాయణ స్మారకార్థం పటేల్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలకు ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, హైదరబాద్, నల్లగొండ, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్ ప్రాంతాల నుంచి 300మందికి పైగా క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు. ఐదు టేబుల్ టెన్నిస్ బోర్డులు ఏర్పాటు చేస్తుండగా నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా క్రీడాకారులు వివరాల కోసం 98484 08335 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో రెజోనెన్స్ శ్రీనగర్ కాలనీ డైరెక్టర్ కె.శ్రీధర్‌తో పాటు రాయల సతీష్, భరణి, ఎంజీవీ.ప్రసాద్, గుర్రం నరేస్, ఎస్.ఉపేందర్, ప్రవీణ్, చలపతి, డాక్టర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



మంత్రి తుమ్మలతో సమావేశమైన ఎమ్మెల్యేలు

**దమ్మపేట:** రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణ గురువారం కలిశారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని మంత్రి తుమ్మల నివాసంలో కలిసినవారు పలు అంశాలపై చర్చించారు. అనంతరం మండలంలోని దురదపాడులో జరుగుతున్న అంకమ్మ తల్లి తిరునాళ్లకు హాజరు కావాలని కోరుతూ మంత్రి, ఎమ్మెల్యేలకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రాలు అందజేశారు. ఎంపీపీ సోయం ప్రసాద్, నాయకులు కాసాని నాగప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, యర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

**ఏన్కూరు:** లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆరికాయలపాడు, శ్రీరామగిరి, బురదరాఘవాపురం, కోదండరామాపురం తండాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు తదితర సౌకర్యాలపై సూచనలు చేశారు. తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓ రమేష్, ఆర్‌ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### సివిల్స్ ర్యాంకర్ తండ్రికి సన్మానం



ప్రకాశ్‌ను సన్మానిస్తున్న ఏసీపీ, తదితరులు

**మధిర:** ఇటీవల వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో బోనకల్ మండలం బోనకల్ మండలం గోవిందపురం(ఎల్) గ్రామానికి చెందిన రావూరి సాయి అలేఖ్య 938వ ర్యాంకు సాధించింది. ఈసందర్భంగా ఆమె తండ్రి, మధిర టౌన్ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రావూరి ప్రకాష్‌ను పలువురు సన్మానించారు. వైరా ఏసీపీ రెహమాన్, మధిర టౌన్ ఎస్సై సంధ్య ఆధ్వర్యాన ఉద్యోగులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| మొక్కజొన్న | 2,155 | 1.850 |
| పెసలు | 8,050 | 6,800 |
| మిర్చి | 20,000 | 9,500 |
| మిర్చి తాలు | 9,300 | 4,000 |
| పత్తి | 7,200 | 5,100 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.14,174 |

# అగ్నికీలల్లో కాలిబూడిదైన ఆస్తులు

- కారేపల్లి మండలంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- ఇంకొన్ని చోట్ల కూడా అగ్ని ప్రమాదాలు
- ఘటనల్లో భారీగా ఆస్తినష్టం



కారేపల్లి : సూర్యతండాలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



నేలకొండపల్లి : మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

**కారేపల్లి:** భానుడి ప్రతాపానికి ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ సమయాన పెద్దశబ్దంతో మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కారేపల్లి మండలం సూర్యతండా నుంచి ఎస్‌టీఆర్ నగర్‌కు వచ్చే మార్గంలో వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గురువారం మధ్యాహ్నం తీవ్ర ఉష్ణోగ్రతతో వేడెక్కిన ట్రాన్స్‌ఫార్మర్ మంటలు అలుముకుని పెద్దశబ్దంతో కాలిపోయింది. ఇదేసమయాన ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే మాలోతు మునిరామ్‌కు చెందిన గడ్డి వాముకు సైతం మంటలు అంటుకుని దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా ఆలస్యం కావడంతో యువకులు గ్రామపంచాయతీ వాటర్‌ట్యాంకర్‌తో నీళ్లు చల్లి మంటలు ఆర్పారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి అధిక వేడి కారణంగానే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని తెలిపారు.

● **సత్తుపల్లిరూరల్:** మండలంలోని బేతుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన దుంప వెంకమ్మ ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గురువారం తెల్లవారుజామున కాలిపోయింది. వెంకమ్మ రేకులతో ఇల్లు ఏర్పాటు చేసుకోగా చుట్టూ తడికలు కట్టుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ఇల్లు పూర్తి కాలిపోగా రూ.5వేల నగదు, టీవీ, ఫ్యాన్, వంట సామాగ్రి కాలిపోవడంతో రూ.50వేలు నష్టం జరిగినట్లు బాధితురాలు వాపోయింది. ఈమేరకు ఆర్‌ఐ నరేష్ పరిశీలించి ప్రభుత్వం తరఫున 20కేజీల బియ్యం అందజేశారు.

● **నేలకొండపల్లి:** చెత్తకు కావాలనే నిప్పు పెట్టారో, ప్రమాదవశాత్తు అంటుకుందో తెలియదు కానీ ఆ మంటలు పెట్రోల్ బంక్ వైపు దూసుకొస్తుండడంతో ఆందోళన నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు... మండలంలోని కొత్తకొత్తూరు పంట పొలాల్లో గురువారం చెత్తకు నిప్పంటుకుంది. ఎలా నిప్పంటుకుందో తెలియకున్నా వేగంగా వీస్తున్న గాలులతో మంటలు సమీపంలోని పెట్రోల్ బంక్ వైపు దూసుకొచ్చాయి. ఇంతలోనే స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది రెండు ఫైరింజన్లతో చేరుకుని తొలుత ఆ ప్రాంతమంతా నీళ్లు చల్లారు. ఆపై గంట పాటు శ్రమించి మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక మండలంలోని బోదులబండలో ప్రమాదవశాత్తు వరి గడ్డి దగ్ధమైంది. గ్రామంలో తుమ్మా సత్యంకు చెందిన గడ్డి వాముకు నిప్పంటించుకోగా 100 దిండ్లు కాలిపోయాయి.

● **రఘునాథపాలెం:** మండలంలోని చిమ్మపూడి, మంచుకొండ గ్రామాల్లో గురువారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదాలతో సుమారు 45 ఎకరాల్లోని సుబాబుల్ తోటలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.కోటి వరకు నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో తోటలకు మంటలు అంటుకోగా వేడిగాలులకు వేగంగా వ్యాపించి తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. మంచుకొండకు చెందిన యల్లంపల్లి హన్మంతరావు, శరణ్, శోభారాణి, చంద్రశేఖర్, కొనకంచి శ్రీనివాసరావు, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, చిమ్మపుడిలో చింతపల్లి నారాయణ, పుల్లయ్య తోటలు కాలిపోగా బాధితుల రైతుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీహరి తెలిపారు. కాగా, చిమ్మపూడిలో ఓ రైతు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా మిర్చి కంపకు మంట పెట్టడంతో ప్రమాదం జరిగిందని సమాచారం.

### జిల్లాలో 44.9 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

**ఖమ్మంవ్యవసాయం:** జిల్లా వాసులకు సూర్యుడు హెచ్చరికలు జారీ చేస్తున్నాడు. ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతుండగా గురువారం రెడ్‌అలర్ట్ అంచుల్లోకి చేరింది. జిల్లాలోని పెనుబల్లిలో అత్యధికంగా 44.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా ప్రాంతాల్లోనూ 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. ఎండ వేడికి పగటి వేళ బయటకు రావాలంటే జనం జంకుతుండగా, బడికి వెళ్లివచ్చే పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కాగా, వేడి కారణంగా గృహ విద్యుత్ వినియోగం 5.5మిలియన్ యూనిట్లకు పైగా నమోదవుతోంది.

# విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్
- ట్రాన్స్‌కో జిల్లా నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

**ఖమ్మంవ్యవసాయం:** విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా కృషి జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మందపాటి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీధర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల పెన్షన్లు, బీమా వంటి సమస్యలను సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఐలేష్, కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీమతి, ట్రాన్స్‌కో జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మోహన్, టీ.వీ.రమేష్‌తో పాటు వి.సీతారాం గోపాల్, నగేష్, నాగేంద్రకుమార్, వల్లాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

**ట్రాన్స్‌కో జిల్లా కమిటీ ఎన్నిక**

327 యూనియన్ ట్రాన్స్‌కో జిల్లా నూతన కమిటీని ఈ సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఏ.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.మధు, కోశాధికారిగా ఎం.సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆతర్వాత వివిధ సంఘాల నుంచి 50 మంది కార్మికులు 327 యూనియన్‌లో చేరారు.

# పాలకులు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, పద్మజాషా



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

**ఖమ్మం సహకారనగర్:** పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందేలా పాలకులు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా సూచించారు. ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ సబ్ క్యాంపస్‌లో గురువారం విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా స్థాయి సదస్సు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, పద్మజ మాట్లాడుతూ ఫాసిస్టు, కార్పొరేట్ అజెండాను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రైవేట్ సంస్థలకు స్వేచ్ఛ ఇవ్వడమేకాక మతవిద్యను ప్రోత్సాహం, విద్యారంగంలో వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ వేగవంతం చేసేలా ఈ విధానం ఉందని తెలిపారు. ఇకనైనా బడ్జెట్‌లో 15శాతం విద్యారంగానికి కేటాయించడంతో పాటు ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకుడు మనోహర్ రాజు, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, వి.వెంకటేష్, మస్తాన్, మందా సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

**ఖమ్మం సహకారనగర్:** లోక్‌సభ ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్ల(సూక్ష్మ పరిశీలకుల) పాత్ర అత్యంత కీలకమని జిల్లా స్థాయి మాస్టర్ ట్రెయినర్ కె.శ్రీరామ్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డితో కలిసి మైక్రో అబ్జర్వర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల నిమిత్తం 270 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర పోలీసుల సమీక్ష

**నేలకొండపల్లి:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా, తదితర అంశాలపై తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల పోలీసు అధికారులు నేలకొండపల్లి పోలీసుస్టేషన్‌లో గురువారం సమావేశమయ్యారు. రాష్ట్ర సరిహద్దు అప్పలనరసింహాపురంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద చేపట్టాల్సిన తనిఖీలపై చర్చించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో కూసుమంచి సీఐ జనార్దన్‌తో పాటు వివిధ సేషన్ల ఎస్సైలు, ఏపీలోని అధికారులు పాల్గొన్నారు.

## 21న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

**ఖమ్మం స్పోర్ట్స్:** సీనియర్స్ విభాగంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపికకు ఈనెల 21న పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కే.ఈ.సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఈ పోటీలు ఉదయం 8–30 గంటలకు మొదలవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డు, వయసు ధృవీకరణ పత్రంతో పాస్‌పోర్ట్ ఫొటోతో హాజరుకావాలని, వివరాలకు 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జట్లను ఈనెల 27నుంచి గోదావరిఖనిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

## చిన్నారి కంటికి పిన్నీసు..



పూజిత కంటి రెప్పకు గుచ్చుకున్న పిన్నీస్

**నేలకొండపల్లి:** చిన్నారులపై ఎప్పటికీ ఓ కన్నేసి ఉంచాలని చెప్పడానికి ఈ ఘటన ఇంకో ఉదాహరణగా నిలుస్తోంది. మండలంలోని నాచేపల్లికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక వాకదాని పూజిత గురువారం మరికొందరితో కలిసి ఆడుకుంటోం. ఈక్రమంలో ఆమె చేతిలో ఉన్న పిన్నీస్ కంటి రెప్పకు గుచ్చుకుంది. దీంతో ఆమె ఏడుస్తుండగా తల్లిదండ్రులు గమనించి నేలకొండపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్ కె.రాజేష్ చాకచాక్యంగా తొలగించారు. అదే పిన్నీస్ ఇంకాస్త కిందకు దిగితే కన్ను గుడ్డుకు ప్రమాదం జరిగేదని తెలిపారు.

## ఆరు కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజిరెడ్డి

**ముదిగొండ:** రెండు ద్విచక్ర వాహనాలపై బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న ఆరు కేజీల గంజాయిని ముదిగొండ ప్రధాన సెంటర్‌లో గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి తెలిపారు. ముదిగొండ మండలం సువర్ణాపురానికి చెందిన నవీన్, మధు, మహేష్, ఖమ్మంకు చెందిన యశ్వంత్, విజయ్, వినయ్, కారేపల్లికి చెందిన ఖాజా ముఠాగా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తక్కువ ధరకు తీసుకొస్తున్నారు. ఆపై చిన్న ప్యాకెట్లుగా మార్చి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా సువర్ణాపురం వైపు నుంచి ద్విచక్ర వాహనాలపై బస్తాల్లో గంజాయి తీసుకుని ముదిగొండ వైపు వస్తుండగా ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. ఈసందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి ఆరు కేజీ గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.